సాక్షి
పెద్దపల్లి

శుక్రవారం । 12 । జనవరి । 2024



సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ

గోదావరిఖని: సింగరేణి క్యాలెండర్‌ను ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఆవిష్కరించారు. గుర్తింపు సంఘం నాయకుడు జగురు రవీందర్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ఎన్టీపీసీ ఈడీ

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు మర్యాద పూర్వకంగా కలిశారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/20.5

వాతావరణం

జిల్లాలో ఈ రోజు వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతుంది. మంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

అవిశ్వాసం వైపు అడుగులు?

- జెడ్పీ సమావేశాలకు సభ్యుల గైర్హాజరు
- 'కోరం' లేదంటూ పలుమార్లు వాయిదా
- చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోసమేనంటూ ప్రచారం
- సంతకాల సేకరణ పూర్తి. నేడో రేపో నోటీసు..?
- అవిశ్వాసానికి కోరం కరువైందంటూ బీఆర్‌ఎస్ ప్రకటన
- చర్చనీయాంశంగా జిల్లా రాజకీయం



గురువారం జెడ్పీ సమావేశంలో ఖాళీగా దర్శనమిస్తున్న ప్రజాప్రతినిధుల సీట్లు

సాక్షి, పెద్దపల్లి: జిల్లా పరిషత్ చైర్మన్‌పై అవిశ్వాస అస్త్రం ప్రయోగించబోతున్నారా..? అవిశ్వాస గండం నుంచి పుట్టమధు బయటపడేనా..? అనే అంశం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గత నెల 28న జరగాల్సిన జెడ్పీ సమావేశం ప్రజాపాలనతో వాయిదా పడింది. బుధవారం నాటి స్టాండింగ్ కమిటీల సమావేశాలు సైతం రద్దయ్యాయి. గురువారంనాటి జెడ్పీ సమావేశం మరోసారి వాయిదా పడింది. దీంతో జెడ్పీ చైర్మన్ పుట్టమధుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకే జెడ్పీటీసీలు గైర్హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది.

క్యాంపునకు జెడ్పీటీసీలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు జోరందుకున్నాయి. జిల్లాలో మంత్రి శ్రీధర్‌బాబు అండంతో మంథని, పెద్దపల్లి నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు బీసీ సామాజికవర్గానికి చెందిన జెడ్పీటీసీలు జెడ్పీ చైర్మన్ పదవి కోసం సంతకాలు సేకరించి, జెడ్పీటీసీలను హైదరాబాద్ క్యాంప్‌నకు తరలించి, రెండు రోజుల్లో నోటీసులు అందించేందుకు కార్యచరణ సిద్ధం చేసినట్లుగా సమాచారం. దీంతో అప్రమత్తమైన బీఆర్‌ఎస్ అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమై, అవిశ్వాస తీర్మానం చేసేందుకు కోరం లేదంటూ పత్రిక ప్రకటన విడుదల చేసింది. దీంతో అవిశ్వాసం వైపు అడుగులు పడతాయా? ఆదిలోనే అడ్డుకట్ట పడుతుందా అనేది త్వరలో తేలనుంది.

బలగమంతా బీఆర్‌ఎస్‌దే

జిల్లాలో 13 జెడ్పీటీసీ స్థానాలున్నాయి. 12స్థానాల్లో బీఆర్‌ఎస్, 2స్థానాల్లో కాంగ్రెస్ జెడ్పీటీసీలు గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఓదెల జెడ్పీటీసీ గంట రాములు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి పాలకుర్తి జెడ్పీటీసీగా గెలిచినా కందుల సంధ్యారాణి బీజేపీ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 11మంది సభ్యుల బలం ఉండగా, కాంగ్రెస్‌లో సుల్తానాబాద్ జెడ్పీటీసీ, బీజేపీ తరఫున ఒక్కరు కొనసాగుతున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ బలంగంలోని వారే జెడ్పీచైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు పావులు కదుపుతుండడం చర్చనీయాంశంగా మారింది.

ఇక్కడ ఐదుగురు.. అక్కడెంతమంది?

జెడ్పీ చైర్మన్ పుట్టమధుపై అవిశ్వాసం పెట్టేందుకు ఇప్పటికే సంతకాలు సేకరించి, సభ్యులను క్యాంపునకు తరలించినట్లు సమాచారం. అప్రమత్తమైన జెడ్పీచైర్మన్ పుట్టమధు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి జెడ్పీటీసీలతో మాట్లాడించే ప్రయత్నం చేశారు. అందుబాటులో ఉన్న నలుగురు జెడ్పీటీసీలతో కలిసి మాజీమంత్రితో సమావేశమై అవిశ్వాసానికి చెక్ పెట్టినట్లుగా ఓ ప్రకటన విడుదల చేశారు. జెడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలంటే మొత్తం జెడ్పీటీసీల్లో మూడోవంతు అంటే తొమ్మిది మందితో నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఐదుగురు, బీజేపీ తరఫున ఒక్కరు తటస్థంగా ఉన్నారని, అవిశ్వాసానికి కోరం కరవైందని బీఆర్‌ఎస్ శ్రేణులు చెబుతున్నాయి.

కోరం కరువు



మాజీ మంత్రి కొప్పులతో జెడ్పీ చైర్మన్ మధు, జెడ్పీటీసీలు

జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్‌పై అవిశ్వాసం విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధిష్టానం మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను రంగంలోకి దింపింది. గురువారం మాజీ మంత్రి తన నివాసంలో అందుబాటులో ఉన్న జెడ్పీటీసీతో సమావేశం అయ్యారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, ధర్మారం జెడ్పీటీసీ పూస్కూరి పద్మజ జితేందర్ రావు, మంథని జెడ్పీటీసీ తగరం సుమలత శంకర్‌లాల్, అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ హాజరై తమకు అవిశ్వాసం పెట్టే ఆలోచన లేదని, పార్టీ పేరు చెప్పి తమను తప్పుదోవ పట్టిస్తున్నారని కొప్పులకు వివరించారు. మిగతా జెడ్పీటీసీలను కొప్పుల ఈశ్వర్ ఫోన్‌లో సంప్రదించగా ముగ్గురు అందుబాటులోకి వచ్చి తమకు అవిశ్వాసానికి వెళ్లే ఉద్దేశంలేదని, శుక్రవారం వచ్చి కలుస్తామని తెలిపినట్లుగా బీఆర్‌ఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది.

సర్వసభ్య సమావేశం వాయిదా



జెడ్పీ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న సీఈవో శ్రీనివాస్

జ్యోతినగర్: జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశం వాయిదా పడింది. గురువారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో ఏర్పాటు చేసినన 19వ సర్వసభ్య సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉందని జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. 11:30గంటల వరకు వేచి చూడగా.. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మంత్రి శ్రీధర్ బాబు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావుతో పాటు జెడ్పీటీసీలు, ఎంపీపీలు గైర్హాజరయ్యారు. గంటసేపు వేచి చూసిన సీఈవో శ్రీనివాస్ జెడ్పీ సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

న్యూస్‌రీల్

పండక్కి ఊరెళ్తున్నారా..?



రెమా రాజేశ్వరి

గోదావరిఖని: సంక్రాంతి పండక్కి ఊరెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని, తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. పండుగ సెలవుల్లో సొంత ప్రాంతాలకు, బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు వెళ్లే ఆయా గ్రామాలు, కాలనీ, అపార్టుమెంట్ వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే వివరాలు పెట్టొద్దని తెలిపారు. ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవటం మంచిదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. విలువైన బంగారు, వెండి, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని తెలిపారు. ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు పోలీస్‌శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుందని సీపీ పేర్కొన్నారు.

సీఎం పీఆర్వోగా నారాయణపూర్ వాసి



బొల్లం శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు బొల్లం శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఆర్వోగా నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందారు. పీజీ వరకు విద్యాభ్యాసం చేసిన శ్రీనివాస్ మొదట ఈనాడు దినపత్రికలో కంట్రిబ్యూటర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం సాక్షి దినపత్రికలో బ్యూరో ఇన్‌చార్జిగా, జనరల్ బ్యూరోగా పనిచేశారు. ప్రస్తుతం వీ6–వెలుగులో బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలోనే ముఖ్యమంత్రి పీఆర్వోగా నియమితులయ్యారు. చిన్నతనం నుంచి సాహిత్యం, జర్నలిజంపై మక్కువ చూపేవారు. చదువుల తల్లి నారాయణపూర్‌లో ఇప్పటికే అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు అధికారులు ఉండగా సీఎం పీఆర్వోగా శ్రీనివాస్ నియామకంపై గ్రామస్తులతోపాటు అతని స్నేహితులు, స్థానిక అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న బొంకూరి మధు

జ్యోతినగర్: దళితుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు, బొంకూరి మధు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్ పేర్కొన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లో జిల్లా కో–కన్వీనర్ పెగడపల్లి నారాయణ అధ్యక్షతన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జ్యోతినగర్ పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దళితుల్లో చైతన్యం తెచ్చేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం జ్యోతి నగర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా దొమ్మేటి శేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దాసారపు వేణు, అధికార ప్రతినిధిగా సోమిడి రాము, ఉపాధ్యక్షులుగా రత్నం కరుణాకర్, ఎస్.శ్రీనివాస్, ఎర్రోళ్ల కు మారస్వామి, రేవెల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గా తగరం రాజేందర్, సహాయ కార్యదర్శిగా రెడపాక శేఖర్, కార్యదర్శులుగా పెగడపల్లి రాజేశ్, ఎలకపల్లి, లింగమూర్తి గడ్డం శ్రీనివాస్, ఈదునూరి శ్రావణ్, కోశాధికారిగా గుర్రం నర్సయ్యను ఎన్నుకున్నారు.

17వరకు సంక్రాంతి సెలవులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం (ఈ నెల12) నుంచి ఈనెల 17వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. అన్ని పాఠశాలల యజమాన్యాలు విధిగా సెలవులు ప్రకటించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే సదరు పాఠశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జేఎన్‌టీయూలో సెమినార్

రామగిరి: మంథని జేఎన్‌టీయూ కళాశాలలో జనవరి 20న మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో కోల్ మైనింగ్ భవిష్యత్తుపై ఒకరోజు సెమినార్ నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. మైనింగ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, జీఎంలు హాజరు అవుతారని తెలిపారు.

సమగ్ర సమాచారంతో నివేదికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, ప్రజా, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరుపై సమగ్ర సమాచారంతో నివేదికలు రూపొందించి సీపీవో(ముఖ్య ప్రణాళికాధికారి)కి అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పలు అంశాలపై అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో పనుల పురోగతి, పెండింగ్ పనుల వివరాలపై నివేదిక రూపొందించి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు మధుమోహన్, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతి



పెద్దపల్లిరూరల్: వడ్డె ఓబన్న జయంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొన్నారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఓబన్న పాత్ర స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, సీపీవో రవీందర్, వడ్డెర సంఘం జిల్లా వైస్‌చైర్మన్ కుంట పోశెట్టి, కార్యదర్శి బాలకృష్ణ, పట్టణ ప్రెసిడెంట్ సమ్మయ్య పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా సీఎంఆర్ డెలివరీ చేయాలి

జిల్లాలో రైస్‌మిల్లర్లు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ రైస్‌ను ఈనెల 31నాటికల్లా డెలివరీ చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సివిల్‌సప్లయ్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీఎస్‌వో ప్రేంకుమార్‌తో కలిసి మిల్లర్లతో సమావేశం అయ్యారు. మిల్లులవారీగా కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. డెలివరీ చేయడంలో నిర్లక్ష్యం చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఐటీయూపై కార్మికులకు నమ్మకం పెరిగింది



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఇటీవల నిర్వహించిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలతో సీఐటీయూపై కార్మికులకు నమ్మకం పెరిగిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నా రు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రావుతో కలసి పా ల్గొని మాట్లాడారు. గత నెల 27న జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన ఏఐ టీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడంతో టీబీజీకేఎస్ ఓటమి పాలైందని ఆరోపించారు. ఏఐటీయూసీ కార్మి కులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, ఉల్లి మొ గిలి, వెంకన్న, సురేశ్, వినయ్, శ్రావణ్, రాకేశ్, విజయ్, ప్రశాంత్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను బోధించాలి



భోగి మంటలు అంటిస్తున్న శ్యాంప్రసాద్

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని, సోషల్ మీడియాకు ఆకర్షితులై జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్న విషయాలను వివరిస్తూ లాభ, నష్టాలపై అవగాహన కల్పించి వారి జీవితంలో వెలుగులు నింపాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలకు ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి మాధవి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతీ బుధవారం ప్రభుత్వ పాఠశాలలను జిల్లాస్థాయి అధికారులు సందర్శించి, విద్యార్థుల సామర్థ్యం, ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలిస్తున్నారని వివరించారు.పాఠశాలల బలోపేతంపై కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ప్రత్యేక దృష్టి సారిస్తూ రాబోయే పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. భోగి మంటలు, హరిదాసుల ప్రదర్శనలు, పంతంగుల పండుగ, రంగోళి, పిండి వంటలు తదితర వేడుకలను నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం అజ్మీరా శారద ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్, డీఈవోలను సత్కరించారు.



గాలి పటమా.. పదపదపదా..



సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు చిన్నాపెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ సంబరాల్లో మునిగిపోతారు. సంక్రాంతికి సంకేతంగా కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తుంటారు. పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో పలువురు చిన్నారులు గురువారం ఇలా పతంగులతో సందడి చేశారు. పిల్లలు ఒకరితో ఒకరు పోటీపడుతూ పతంగులు ఎగురవేస్తూ సంతోషంతో మురిసిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఇంటికి పోదాం.. చలో చలో




సంక్రాంతి వచ్చింది... చిన్నారులకు సెలవులు తెచ్చింది. శుక్రవారం నుంచి ప్రభుత్వం విద్యాసంస్థలకు పండగ సెలవులు ప్రకటించడంతో గురువారం సాయంత్రం పెద్దపల్లి జిల్లాకేంద్రంలో సందడి కనిపించింది. వివిధ పాఠశాలల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఉదయాన్నే బట్టలు, పుస్తకాలు ట్రంక్ పెట్టెల్లో సర్దుకుని మధ్యాహ్నం భోజనం చేసి తల్లిదండ్రులు వచ్చాక ఇంటిబాట పట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

స్వచ్ఛతలో వెనుకంజ!

- స్వచ్ఛసర్వేక్షణ్‌లో బల్దియాకు 175వ జాతీయ ర్యాంకు
- గతేడాది 136వ ర్యాంకు
- పాలకవర్గం, అధికారుల మధ్య సమన్వయ లోపమే కారణం



ఈ నాలా గోదావరిఖని శివాజీనగర్‌లోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ పక్కది. వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. మార్కెట్‌లోని చేపలు, కోళ్లు, మాంసం వ్యర్థాలతోపాటు కుళ్లిపోయిన పండ్లను ఇందులోనే పడేస్తున్నారు. దీంతో మురుగు ప్రవాహానికి అంతరాయం ఏర్పడి, కంపుకొడుతోంది. పూడికతీత పనులు సాగడం లేదు. నగంలోని నాలాల శుభ్రతను స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో పరిగణంలోకి తీసుకుంటారు. నాలాల దుస్థితి ఇలా ఉంటే ర్యాంకు ఎలా వస్తుందో పాలకులు, అధికారులకే తెలియాలి.

రామగుండంలో పారిశుధ్యం మెరుగుపర్చడానికి రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన అత్యాధునిక యంత్రాలు, వాహనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. రెండేళ్ల కిత్రం రూ.45 లక్షలతో కొనుగోలు చేసిన హుక్ లోడర్ ట్రక్‌ను ఒక్కరోజు కూడా వాడకుండా చెత్త కుప్పల్లో పడేశారు. చెత్తను కాల్చి బూడిదగా మార్చడానికి రూ.39 లక్షలతో రెండున్నరేళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాస్మిక్ కోర్–వేస్ట్ డెస్ట్రక్షన్ సిస్టమ్ అనే ఆధునియ యంత్రాన్ని వాడకుండా నిర్లక్ష్యం చేశారు. మిక్సిడ్ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి రెండున్నరేళ్ల క్రితం రూ.70 లక్షలతో కొనుగోలు చేసిన రెండు స్టాటిక్ కంపాక్టర్లను ఒక్కరోజూ కూడా ఉపయోగించలేదు.



కోల్‌సిటీ(రామగుండం): స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో జిల్లాలోని రామగుండం నగరపాలకసంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు కూడా వెనకబడుతున్నాయి. గురువారం కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన మున్సిపాలిటీల జాబితాను ప్రకటించింది. ఇందులో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు ఆశించినస్థాయిలో ర్యాంకులు సాధించలేకపోయాయి. పారిశుధ్యం మెరుగుపర్చడానికి, ప్రజలకు స్వచ్ఛతను అందించేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఏటా 'స్వచ్ఛ సర్వేక్షణ్' పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

రామగుండానికి 175వ ర్యాంకు

స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో రామగుండం జాయతీ స్థాయిలో నగరపాలక సంస్థ 175వ ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. గతేడాది 136వ ర్యాంకు సాధించింది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ర్యాంక్ రాకపోవడానికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శలొస్తున్నాయి. పెద్దపల్లికి జాతీయస్థాయిలో 1,173వ ర్యాంకు, సుల్తానాబాద్ 3,034వ ర్యాంకు, మంథనికి 2,678వ ర్యాంకు వచ్చింది. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో రామగుండంకు 1646.5, పెద్దపల్లికి 1518.4, సుల్తానాబాద్‌కు 987.5, మంథనికి 1459.2 శాతం వచ్చింది. రామగుండం నగరపాలక సంస్థ ఏడేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పోటీ పడుతోంది. ఓడీఎఫ్ నుంచి ఓడీఎఫ్ ప్లస్ దగ్గరే ఆగిపోయింది.

రామగుండం శానిటేషన్ ప్రొఫైల్

బల్దియా విస్తీర్ణం:	93.87 (చదరపు కిలోమీటర్లు)
డివిజన్లు:	50
జనాభా:	2,29,644
నివాసాలు:	63,000
రోజూ వెలువడే చెత్త:	సుమారు 150 మెట్రిక్ టన్నులు
పారిశుధ్య కార్మికులు:	448



తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియ రామగుండంలో కాగితాలకే పరిమితం అవుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తడి, పొడిచెత్త నిర్వహణ ప్రక్రియతోపాటు బహిరంగ మల, మూత్ర విసర్జన, మురుగు నిర్వహణపై వేసే మార్కులు చాలా కీలకం. కేవలం పొడి చెత్త నిర్వహణ చేపడుతున్న అధికారులు తడి చెత్తపై చేతులెత్తేశారు. తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేసేందుకు గోదావరిఖనిలోని గౌతమినగర్, ఎన్టీఆర్‌నగర్, జ్యోతినగర్‌లో ప్రత్యేంగా షెడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ వినియోగానికి నోచుకోలేదు.

వన దేవతల జాతరకు ఏర్పాట్లు



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

గోదావరిఖని: మినీ మేడారంగా పిలుస్తున్న గోదావరిఖని సమ్మక్క– సారలమ్మ జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గోదావరినది తీరంలోని బ్రిడ్జి సమీపంలో కొలువైన వనదేవతల జాతర వచ్చేనెల 21 నుంచి 24వరకు జరగనుంది. ఇందుకోసం సింగరేణి, రామగుండం మున్సిపల్‌కార్పొరేషన్, పోలీసు అధికారులు సంయుక్తంగా సమీక్షిస్తున్నారు. జాతరకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటీతో పర్యవేక్షిస్తున్నారు. జాతర ప్రాంగణాన్ని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులు, రాజీవ్‌రహదారి పక్కనే జాతర ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తదితర విషయాలపై సమీక్షించారు. జాతర కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రామగుండం ఎమ్మార్వో కుమారస్వామి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, టూటౌన్ సీఐ సూరం వేణుగోపాల్, కమిటీ సభ్యులు మోహన్‌రెడ్డి, ఎం.నగేశ్, ఈశ్వర్, ఆశాలు, లక్ష్మీనారాయణ, నారాయణ, రాజమల్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహుని హుండీ ఆదాయం రూ.54.21 లక్షలు



హుండీ లెక్కిస్తున్న వలంటీర్లు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 95 రోజుల్లో రూ.54,21,314 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. అలాగే 90 గ్రాముల మిశ్రమ బంగారం, 6.20కిలోల మిశ్రమ వెండి, 31 విదేశీనోట్లు సమకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా గ్రూప్ దేవస్థానం ఈవో వేణుగోపాల్, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, గందె పద్మ, గునిశెట్టి రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణకు దేశరత్న అవార్డు



త్రీడీ ఆర్ట్‌ను పరిశీలిస్తున్న ఉత్తరప్రదేశ్ ఎంపీ



శివరామకృష్ణ

రామగిరి(మంథని): మంథని జేఎన్‌టీయూ కళాశాల మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ పెయింటర్ సింగారపు శివరామకృష్ణ ప్రతిష్టాత్మక దేశరత్న అవార్డుకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరిలో కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకోనున్నాడు. భారత్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ శివరామకృష్ణను అవార్డుకు ఎంపిక చేస్తూ లేఖ పంపించింది. కాగా ఇటీవల ఆర్ట్‌ను తిలకించిన ఉత్తరప్రదేశ్ ఎంపీ జగదాంబికపాటిల్ దేశంలో త్రీడీ ఆర్ట్ ఒక శివరామకృష్ణతోనే అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహాభారత కాలంనాటి పురాతన కళ అయిన త్రీడీ ఆర్ట్ తెలిసినవారు దేశంలో అతి తక్కువ మంది ఉన్నారని అందులో శివరామకృష్ణ ఒకరని కితాబునిచ్చారు. ఈ కళను అమెరికాలో ప్రదర్శించి అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లిన ఘనత అతడికే దక్కుతుందని అభినందించారు. అవార్డుకు ఎంపికైన శివరామకృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

గోడకూలి గుర్తుతెలియని వ్యక్తి మృతి



కోరుట్ల: పట్టణంలోని టీచర్స్‌క్లబ్ రోడ్‌లో గురువారం గోడ కూల్చుతుండగా కూలిపోవడంతో గోడపక్కనే ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 56790 నంబర్‌కు తెలుపాలని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విచారణ పేరుతో కాలయాపన

జగిత్యాల: జిల్లా మత్స్యశాఖ అధికారిపై అవినీతి ఆరోపణలపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోవడం లేదని, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని డీఎఫ్‌ఎస్‌సీ తాత్కాలిక అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. కార్యాలయంలో మాట్లాడుతూ సొసైటీలకు వ్యతిరేకంగా సొసైటీ తీర్మానాలు లేకుండా స్కిల్ టెస్ట్ పెడుతూ మత్స్యకారులను మత్స్యశాఖ అధికా రి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారిపై చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ శ్రీను, శంకర్, భూమేశ్, రాజశేఖర్, రమేశ్, గణేశ్, రాజేందర్, గణేశ్, నక్క శివ పాల్గొన్నారు.

నృసింహుడికి స్టీల్ హుండీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామికి రూ.రెండు లక్షల విలువైన స్టీల్ హుండీలను యూనియన్ బ్యాంక్ డీజీఎం శంకర్ హేంబ్రమ్ బహూకరించారు. ఆలయ ఈవో శ్రీనివాస్‌కు అందించారు. అర్చకులు బ్యాంకు అధికారులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ పొన్నం వెంకట్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ సరల్ గుప్తా, ధర్మపురి బ్యాంకు మేనేజర్ రవితేజ తదితరులున్నారు.



స్టీలు హుండీలు బహూకరిస్తున్న డీజీఎం

అలిశెట్టి.. ఎంతో ఘనకీర్తి

- మరణమెప్పుడూ చివరి చరణం కాదని సంక్షోభ గీతం ఆలపించిన రోజు
- నేడు అలిశెట్టి వర్ధంతి, జయంతి



ప్రభాకర్ (ఫైల్)

జగిత్యాల: మరణమెప్పుడూ చివరి చరణం కాదని సంక్షోభ గీతం ఆలపించిన రోజు.. జనవరి 12న ఒక విషాదమైన రోజు. అక్షరసూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ అస్తమించిన రోజు. 'జనవరి 12 నీ పుట్టిన రోజు నాన్న' అంటూ జగిత్యాల జనం అక్షర నక్షత్రాలు వెలిగిస్తుంటే.. 'జనవరి 12 నీ వర్ధంతి కన్నా' అంటూ ఆ భాగ్యనగరం కన్నీళ్లని కవన భాషలోకి అనువదిస్తోంది. కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ చిక్కడపల్లి సెంటర్‌లో తప్పిపోయిన జగిత్యాల పోరడు.. సిటీలైఫ్‌లో మంటల జెండాలెగరెయ్యడానికి పోయి మళ్లీ రాలేదు. అలిశెట్టి చిన్నతనంలోనే మరణించడం సాహితీ లోకానికి తీరని లోటు. తను రాసిన కవితలు బుల్లెట్‌లా ఉంటాయి. చిన్నచిన్న పదాలతోనే ఎంతో అర్థం వచ్చేలా కవితలను అల్లే ఘనత ఆయనకే దక్కుతుంది. ఇప్పటికీ జగిత్యాల జిల్లాలో అతన్ని ఎవరూ మరిచిపోరు.


బుల్లెట్ లాంటి కవితలు





తాను శవమై.. ఒకరికి వశమై.. తనువు పుండై.. ఒకరికి పండై.. ఎప్పుడు ఎడారై.. ఎందరికో ఒయాసిస్సై.. జీవితాంతం కలల మత కలేబరాలు కాలుతున్న చోట ఈ కవిత ప్రతిధ్వనిస్తూనే ఉంది. వేదన భరితమైన ఈ కవిత రాసినప్పుడు అలిశెట్టి వయస్సు 18 ఏళ్లు మాత్రమే. గొప్ప కవి, చిత్రకారుడు, ఫొటోగ్రాఫర్ అయిన ప్రభాకర్ 12 జనవరి 1954లో జగిత్యాలలో జన్మించారు. 12 జనవరి 1993లో హైదరాబాద్‌లో మరణించారు. ఎన్నో వెతలతో ఎన్నెన్నో కవితలు రాశాడు. తను అనారోగ్యంతో బాధపడుతూ మందులు కొనుక్కోలేని స్థితిలో హైదరాబాద్‌లో గడిపాడు. చివరకు చనిపోయే రోజు కూడా 'మరణం నా చివరి చరణం కాదు.. మౌనం నా చితాభస్మం కాదు.. మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం నా అశ్రుకణం కాదు'.. అంటూ కవిత రాశారు.

కవిత్వానికి జాతీయజెండా..



తెలుగు మినీ కవిత్వంలో జాతీయజెండా లాంటి వాడు అలిశెట్టి ప్రభాకర్. ఆయన కవిత్వమే కాదు జీవితం కూడా ఒక సంక్షోభ గీతం. చనిపోయే రోజు కూడా మరణం నా చివరి చరణం కాదు అంటూ కవిత రాయడం ప్రభాకర్‌కే చెల్లింది. వేశ్య మీద రాసిన కవితకు సమానమైన కవిత ఇప్పటి వరకు ఎవరూ రాయలేకపోయారు. ఈ మధ్యకాలంలో అలిశెట్టి కవితలను ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల్లో ప్రవేశపెట్టడం తెలంగాణ కవులకు ఒక గుర్తింపు లభించినట్లు. తెలంగాణ ఉద్యమంలో ఆయన బతికి ఉంటే ఎంత గొప్ప కవిత్వం వచ్చి ఉండేదో అన్పిస్తుంది.

– కేవీ.నరేందర్, ప్రముఖ కథారచయిత

మామూళ్ల ముచ్చట రచ్చ రచ్చ..!

- బెల్ట్‌షాపులకు మద్యం సరాఫరాలో..
- మెట్‌పల్లి సర్కిల్‌లో వైరల్‌గా ఆడియో రికార్డులు
- మార్ఫింగ్ అని కొట్టిపారేసిన ఎక్సైజ్ అధికారి
- ఇరువర్గాల మధ్య రాజీ కుదిరినట్లు ప్రచారం..

కోరుట్ల/మెట్‌పల్లి: చిన్న వివాదం.. చినికిచినికి గాలివానలా మారి ఎక్సైజ్ శాఖ మామూళ్ల గుట్టును రట్టు చేయడం చర్చనీయంగా మారింది. బెల్ట్‌షాపులకు మద్యం సరాఫరా చేయడంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఓ బార్ షాపు నిర్వాహకుడికి ఎక్సైజ్ అధికారి చెప్పడం.. సదరు వ్యాపారి బార్లు, వైన్స్‌షాపులకు ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించడం.. మాటామాటా పెరిగిన ఆ ఆడియో రికార్డులు బయటకు వచ్చి వైరల్ కావడం మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్‌లో రచ్చకు దారితీసింది. ఫలితంగా గతంలో సదరు అధికారి ఎక్సైజ్ శాఖలోని ఓ ఉన్నతాధికారికి సంవత్సరానికోసారి ముట్టజెప్పే లాంఛనం కోసం ఒత్తిడి తెచ్చిన విషయాన్ని గుర్తుచేసే ఆడియో రికార్డు వైరల్ అయింది. ఈ క్రమంలో ఎక్సైజ్ శాఖలో కింది నుంచి పైదాకా ఏటా అందించే ముడుపుల గుట్టు చర్చనీయంగా మారింది.

ఇదీ జరిగింది

మెట్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆలయాల సమీపంలో మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న కొందరు అనధికారిక బెల్ట్‌షాపుల నిర్వాహకులు వైన్ షాపుల్లో మద్యం తీసుకోవడానికి బదులు బార్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం బార్ల నుంచి బయటకు సేల్స్ ఉండొద్దు. బుధవారం ఎక్సైజ్ తనిఖీల్లో కొన్ని బెల్ట్‌షాపుల్లో బార్ నుంచి మద్యం కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. సాధారణంగా ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు పెద్దగా పట్టింపు చూపరు. కానీ.. మెట్‌పల్లి ఎక్సైజ్ అధికారి తమ బార్ నుంచి పంపిన మద్యాన్ని పట్టుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ సదరు బార్ భాగస్వామి ఎక్సైజ్ అధికారికి ఫోన్ చేశాడు. అనంతరం జరిగిన వాగ్వాదం ఆడియో రికార్డులు వైరల్ కావడంతో వివాదం ముదిరింది. ఈ పరిస్థితిలో సదరు వ్యాపారి గతంలో తమను సదరు ఎక్సైజ్ అధికారి 'సంవత్సరానికోసారి' ముట్టజెప్పే 'ఆనవాయితీ' ప్రకారం వ్యవహరించకుంటే జరిగే పరిణామాల విషయంలో మాట్లాడిన ఆడియో రికార్డు లీక్ చేసి వైరల్ చేశాడు.

కింది నుంచి పైదాకా..

ఎక్సైజ్ అధికారి, బార్ వ్యాపారి మధ్య ఆడియో రికార్డుల కలకలంతో మొదలైన వివాదం చివరికి కింద నుంచి పైదాకా బార్ షాపుల నుంచి ఏడాదికి ఎవరెవరికి ఎంత ముడుపులు ముడుతున్నాయన్న అంశాన్ని బట్టబయలు చేసిందన్న ప్రచారం జరుగుతోంది. ఒక్కో బార్‌షాపునకు అధికారి పరిధిని అనుసరించి ముడుపులు ముడుతున్న వైనం బహిరంగ రహస్యంగా మారింది. (ఉదాహరణకు: ఏదైనా మున్సిపల్ పరిధిలోని ఓ ఎక్సైజ్ అధికారి పరిధిలో తక్కువ సంఖ్యలో బార్లు, వైన్స్‌లు ఉంటే వారికి కాస్త ఎక్కువ మొత్తంలో.. డివిజన్, జిల్లా స్థాయి అధికారుల పరిధిలో ఎక్కువ మొత్తంలో బార్లు, వైన్స్‌లు ఉంటే వారికి కాస్త తక్కువగా మామూళ్లు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.)

రాజీ కుదిరిందా..?

మెట్‌పల్లిలో ఆడియో రికార్డులు రచ్చకెక్కిన తరువాత గురువారం మెట్‌పల్లి ఎక్సైజ్ కార్యాలయంలో బార్‌షాపుల యజమానులతో సమావేశం జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అనంతరం వైరల్ అయిన ఆడియో రికార్డుల్లో ఉన్న వాయిస్ కొంతమేర మార్ఫింగ్ జరిగిందని, తనకు ఆ వాయిస్‌కు ఎలాంటి సంబంధమూ లేదని, దాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడటం సరికాదని, నిబంధనల ప్రకారం మద్యం పట్టుకున్నామని మెట్‌పల్లి సర్కిల్ ఎక్సైజ్ అధికారి రాధ తెలిపారు.

అక్రమకట్టడం తొలగించాలని ఆమరణ నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న రవిచందర్‌రెడ్డి తదితరులు

జమ్మికుంట(హుజూరాబాద్): అక్రమ కట్టడం తొలగించాలని పట్టణంలోని గాంధీచౌక్ వద్ద హౌజింగ్ బోర్డుకాలనీకి చెందిన వార్డు మాజీ సభ్యుడు తూడి రవిచందర్‌రెడ్డి గురువారం ఆమరణ నిరహార దీక్ష చేపట్టాడు. ఈసందర్భంగా రవించదర్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో సర్వే నంబర్ 688లో గల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి, నిర్మాణం చేపడుతున్న కౌన్సిలర్ శ్రీపతి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (వరంగల్), జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీక్ష చేపట్టడంతో దిగివచ్చిన మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. ఆక్రమణకు గురైన స్థలం వివరాలు అందించాలని రవీచందర్‌రెడ్డిని కోరారు. అనంతరం పోలీసులు దీక్ష శిబిరానికి చేరుకొని విరమింపజేశారు. దీక్షకు మద్దతుగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడ్డ ప్రబుద్ధుడి అరెస్ట్



ప్రబుద్ధుడిని అరెస్టు చూపుతున్న చందుర్తి సీఐ

చందుర్తి(వేములవాడ): వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడ్డ ప్రబుద్ధుడిని చందుర్తి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు. చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన ఆవునూరి తిరుపతి(37) ఈనెల 9న అదే మండలం లింగంపేటకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలిని బెదిరించి ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారులోని శ్మశానవాటిక వద్ద లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న తిరుపతిని మర్రిగడ్డ శివారులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జగిత్యాల: మాతాశిశు సంరక్షణ కేంద్రంలోని ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. గురువారం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో సిబ్బంది ఉండటం లేదని, ఆస్పత్రిని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వారిని పిలిపించి సమస్యపై ఆరా తీశారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉండాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వార్డును సందర్శిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరుచూ ఫిర్యాదులు రావడంపై వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు ఉన్నారు.

వీఆర్‌ఏ హఠాన్మరణం



ధర్మపురి మృతదేహం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన గుమ్మడి ధర్మపురి (58) గురువారం హఠాన్మరణం చెందినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఎప్పటిలాగే ఉదయం విధులకు వచ్చిన ధర్మపురి.. పనిచేస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



సయ్యద్ నాజీ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన సయ్యద్ అస్లాంకు, వేములవాడ మండలం తుర్కాశీనగర్‌కు చెందిన నాజీ(21)తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి మూడు నెలల క్రితం ఓ పాప జన్మించింది. పాపకు కండ్లు కనిపించక బాధపడుతున్నారు. వీటికి తోడు భర్త అస్లాం కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. గురువారం ఉదయం అస్లాం పేయింటింగ్ పనికి, అత్తమామలు కూలీ పనికి వెళ్లిన సమయంలో నాజీ ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు ప్రశాంత్, ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కామిడి సాంబశివారెడ్డి (47)హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మండలంలోని గొల్లపల్లిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాంబశివారెడ్డికి తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

వెల్గటూర్‌లో..

వెల్గటూర్(ధర్మపురి): కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం జగదేవుపేట గ్రామానికి చెందిన మానుపాటి రవీందర్ (31)కు లోకిని సౌందర్యతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. రవీందర్ కొన్నేళ్లుగా బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి ఈ మధ్యే వచ్చాడు. అయితే అతడి భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని, తన కుటుంబసభ్యులతో రవీందర్ కుటుంబాన్ని వేధింపులకు గురిచేసింది. దీంతో ఆవేదనకు గురైన రవీందర్ డిసెంబర్ 22న క్రిమిసంహారక మందు తాగగా, కుటుంబసభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



జగిత్యాల: ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ అన్నారు. గురువారం తన కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్–711 రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అధ్యాపక బృందం ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. చురుకైన విద్యార్థులను గుర్తించి ఎంసెట్, నీట్‌ప్రవేశ పరీక్షలకు ప్రోత్సహించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, తిరుపతి, రాజేశం, విజయేందర్‌రావు పాల్గొన్నారు.

రహదారి పనుల బిల్లుల విషయంలో వివాదం

- బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం
- పరస్పరం దాడి.. ముగ్గురిపై కేసు



దాడిలో గాయపడిన శ్రీనివాస్

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): రహదారి నిర్మాణ పనుల బిల్లుల చెల్లింపులో జాప్యంపై గురువారం మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య వివాదం జరిగింది. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాలకు రెండేళ్ల క్రితం ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు కాగా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండె రమేశ్ కాంట్రాక్ట్ దక్కించుకొని మూడు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. వీటికి సంబంధించిన బిల్లులో మొదట రూ.6.49 లక్షలు, రెండోసారి రూ.3.50 లక్షలు చెల్లించినా, మరో రూ.1.38 లక్షల చెల్లింపు విషయంలోనే వివాదం తలెత్తింది. తమకు రావాల్సిన మిగతా బిల్లు గురించి గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా ఫలితం లేదని గురువారం గ్రామంలోని ఓ హోటల్ వద్దకు వెళ్లిన రాజారెడ్డి, రమేశ్ అక్కడే ఉన్న బీజేపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ (సర్పంచ్ అల్లుడు)ను అడిగారు. ఈక్రమంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. అయితే తమకు రావాల్సిన బిల్లుల చెల్లింపు విషయంలో శ్రీనివాస్ ఉద్దేశపూర్వంగానే అడ్డుపడుతున్నాడని, గతంలో అతడిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, అలా అయితేనే బిల్లులు వస్తాయని చెబుతున్నారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంపీటీసీ ఎన్నికల సమయంలో తమ గ్రామంలో బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారని, హామీలు నెరవేర్చాలని తాము నిరసన కార్యక్రమాలు చేపడుతూ ప్రశ్నిస్తున్నందుకే తమపై కక్ష కట్టి దాడులకు పాల్పడుతున్నారని శ్రీనివాస్ ఆరోపించాడు. కాగా ఘర్షణపై రెండు వర్గాలు మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

చిరుత సంచారంపై అటవీ అధికారుల అలర్ట్





చిరుత సంచరించిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

- సత్తక్కపల్లి శివారులో రోజంతా గస్తీ
- సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో చిరుత సంచారంపై ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు అప్రమత్తయ్యారు. గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్న చోట, వరదకాల్వ వైపు, ఇతర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టారు. రోజంతా అక్కడే ఉన్న అధికారులు చిరుతపులి ఎక్కడి నుంచి ఏ దారిలో వెళ్తుందోనని పాదముద్రల ఆధారంగా అంచనాకు వచ్చారు. ఉసికెగుట్ట నుంచి మధ్యలో ఉన్న పంటపొలాల మీదుగా వరదకాల్వ వైపు ఒకే దారిలో నడిచినట్లు గుర్తించారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. పెద్దపల్లి జిల్లా మంథని అటవీ కార్యాలయం నుంచి నాలుగు కెమెరాలు తీసుకువచ్చి అనుమానిత ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కిలోమీటర్‌లోపు 200 మీటర్ల దూరం మధ్య మొత్తం 4 నాలుగు కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా ఓ గొర్రెల కాపరి చిరుత కనిపించందని చెప్పడంతో ఆచోట పాదముద్రలను పరిశీలించారు. మరోవైపు చిరుత సంచరించిన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, బీట్ ఆఫీసర్లు శివరాజ్, రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



గుంతలో దిగబడిన ఇసుక లారీ

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం మూలమలుపు వద్ద గురువారం ఓవర్ లోడ్‌తో వస్తున్న ఇసుక లారీ భారీ గుంతలో దిగబడి పక్కకు ఒరిగింది. బోల్తాపడితే పెనుప్రమాదం జరిగేదని వ్యాపారులు పేర్కొన్నారు. మూలమలుపుల వద్ద భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఓవర్‌లోడ్ లారీలను అదుపుచేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇసుక లారీ గుంతలో దిగబడటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. రెండు జేసీబీల సాయంతో లారీని ఇసుక క్వారీ సిబ్బంది ఘటన స్థలం నుంచి తొలగించారు. కాగా, పట్టణంలోని మసీదు వద్ద గతంలో ఓవర్‌లోడ్ గ్రానైట్ లారీ ఓ ఇంటి మీద బోల్తాపడింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఓవర్‌లోడ్ లారీలకు సంబంధిత అధికారులు జరిమానా విధించి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం




ఒరిగిన ఆర్టీసీ బస్సు

కోనరావుపేట(వేములవాడ): సిరిసిల్ల నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి గాయాలుకాలేదు. సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు సిరికొండకు 31 మంది ప్రయాణికులతో వెళ్తుంది. సిరికొండ శివారులో మైలారం బొడ్డుమామిడి చెరువు వద్ద ఎదురుగా వస్తున్న కారు హఠాత్తుగా కుడిపక్కకు తిరిగింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ కారు ను తప్పించబోగా అదుపుతప్పి పక్క కాలువలోకి ఒరిగింది. బస్సు పక్కకు ఒరగడంతో ప్ర యాణికులు ఆందోళనకు గురయ్యారు. చిన్న పాటి గాయాలు తప్ప ఎలాంటి ప్రమాదం జరుగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మిత్రుడి హాల్ టికెట్‌తో పరీక్షకు..

కరీంనగర్‌సిటీ: తన హాల్ టికెట్ పోవడంతో మిత్రుడి హాల్ టికెట్‌తో పరీక్షకు హాజరై దొరికిపోయిన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల పరీక్షా కేంద్రంలో జరిగింది. ఈ ఘటనలో హాల్ టికెట్ ఇచ్చిన మిత్రుడు కూడా మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ కావడం గమనార్హం. వివరాలు.. శాతావాహన యూనివర్సిటీ డిగ్రీ కోర్సులకు సంబంధించి మొదటి, మూడవ పరీక్షలు జరుగుతున్నాయి. ధర్మపురి పట్టణంలోని 4 డిగ్రీ కళాశాలకు సంబంధించిన విద్యార్థులు స్థానిక నైట్ కాలేజీలో (శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల) పరీక్షలు రాస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మొదటి సెమిస్టర్ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో స్థానిక నవోదయ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి తన హాల్ టికెట్ పోవడంతో తనతో పాటే పరీక్షకు హాజరయ్యే మిత్రుడి బ్యాక్ లాగ్ పేపర్ హాల్‌టికెట్ తీసుకొని హాజరై పరీక్షను రాస్తున్నాడు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రత్యేక తనిఖీలు చేయడంతో ఇద్దరూ దొరకగా, మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారు.

సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి



జగిత్యాలక్రైం: సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలని అడిషనల్ డీజీపీ షిక గోయల్ అన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాంకేతికత నేపథ్యంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్నందున పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిని సైబర్ వారియర్‌గా నియమించాలని సూచించారు. జిల్లాస్థాయిలో డీ ఫోర్సింగ్ (డిస్ట్రిక్ట్ సైబర్‌క్రైం కో–ఆర్డినేటర్ సెంటర్)ను ఏర్పాటు చేసి ఒక డీఎస్పీ స్థాయి అధికారితో జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాల దర్యాప్తు పరిశీలించాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడినప్పుడు వెంటనే 1930కు కాల్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ జిల్లాల్లో రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసిన సందర్భాల్లో వీరిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి అరెస్ట్ చేయాలని సూచించారు. వీసీలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.